క్లుప్తంగా

విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ బీసీ కమిషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నవంబర్ 02న హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశంలో బీసీలు పాల్గొన్ని విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో తమ అభిప్రాయాలను తెలపడం కోసం, నేడు (మంగళవారం) ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 99892 92091ను సంప్రదించాలని సూచించారు.

పిచ్చి మొక్కలు తొలగించాలని వినతి



కాటారం: మహాముత్తారం మండలంలోని రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతూ జిల్లా ఆర్అండ్‌బీ అధికారులకు బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. కాటారం నుంచి మేడారం ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. పిచ్చి మొక్కల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు గమనించుకోక స్తంభంపల్లి(పిపి), బొర్లగూడెంకు చెందిన పలువురు రోడ్డు ప్రమాదాల భారినపడి ప్రాణాపాయస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు.

పోలీసులకు ఫిర్యాదు

కాటారం: మండలంలోని ధన్వాడ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన భూమిలో మట్టిపోసి రోడ్డు వేసిన ఇండియన్ గ్యాస్ గోదాం యజమాని దేవరాజుపై పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి లా షరీఫ్ తెలిపారు. ఏఎంసీకి సంబంధించిన భూమిని ఆక్రమించుకొని గోదాం యజమాని మట్టి రోడ్డు వేసినట్లు కార్యదర్శి తెలిపారు. దీంతో చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఫిర్యాదు అందజేసినట్లు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మంగపేట: మండల నూతన తహసీల్దార్‌గా తోట రవీందర్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ వీరస్వామి ఆగస్టు 31న పదవీ విరమణ కాగా ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. తాడ్వాయి మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న తోట రవీందర్‌ను మంగపేట తహసీల్దార్‌గా బదిలీ చేస్తు కలెక్టర్ దివాకర టీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తహసీల్దార్ రవీందర్‌కు డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంఆర్ఐ శ్రీనివాస్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పార్థసారధి, విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదపుటంచుల్లో ప్రయాణం

- ప్రైవేట్ వాహనదారుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు



కూలీలను తీసుకెళ్తున్న ట్రాలీ (ఫైల్)

మొగుళ్లపల్లి: గ్రామీణ యువత జీవనోపాధి కోసం ఎక్కువగా ఆటో, జీప్ డ్రైవర్లుగా మారి జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కాగా, గ్రామాల్లో ప్రైవేట్ వాహనాల పరిమితులపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలను నడపడం వల్ల ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపాల్లాగా మారుతున్నాయి. జీవనోపాధి కోసం డ్రైవింగ్‌ను ఎంచుకున్న వారు వాహనాలకు ఉండే పేపర్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తదితర అంశాలు కలిగి ఉండాలనే నింబంధనలు ఉన్నా వాటిని పాటించుకోకుండా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితి వస్తోంది.

అధిక సంఖ్యలో కూలీల తరలింపు

ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పత్తి ఎరడం తదితర పనులకు కూలీలను రైతులు ప్రైవేట్ వాహనాల్లో తీసుకెళ్తున్నారు. జీప్‌లో సీట్ కెపాసిటీ ఏడుగురు, చిన్న ఆటోలో నలుగురు, పెద్ద ఆటోలో ఏడుగురు, టాటా మ్యాజిక్‌లో ఏడుగురు ప్రయాణికులు ప్రయాణించాల్సి ఉండగా గ్రామాల్లో మాత్రం అందుకు విరుద్ధంగా 20 మందికి తగ్గకుండా ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలను నడుతున్నారు. వ్యవసాయానికి వాడాల్సిన ట్రాక్టర్లను సైతం కూలీలను తరలించేందుకు వినియోగించడంతో ప్రమాదవశాత్తు పడిపోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. సరుకులు తదితర పనులకు ఉపయోగించే వాహనాలను సైతం ప్రస్తుతం కూలీల తరలింపునకు వాడుతున్నారు. ఈ వాహనాల్లో కూడా ఎక్కువ సంఖ్యలో తీసుకెళ్లడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ఇలా ప్రతీ సంవత్సరం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి ప్రైవేట్‌వాహనాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు వెళ్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు..



గ్రామాల్లో తిరిగే ఆటోలు, జీప్‌లు, టాటామ్యాజిక్ డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్‌లతో వెళ్లే వాహనాలపై చర్య తీసుకుంటాం. ప్రతీ డ్రైవర్ తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలి. వాహనాల పేపర్లు కలిగి లేని వాహనాలపై చట్టం ప్రకారం సీజ్ చేస్తాం. కావున ప్రతి ఒక్కరూ వాహన చట్టం ప్రకారం నడుచుకోవాలి.

–అశోక్, ఎస్సై, మొగుళ్లపల్లి

ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు

టేకుమట్ల: చలివాగు, మానేరుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు తప్పవని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి మానేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్లు శ్రీపతి అభిలాష్, ఉడుత వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కాటారం: మండలంలోని విలాసాగర్ నుంచి రాత్రి పూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సోమవారం ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. రాత్రి సమయంలో విలాసాగర్ మానేరు వాగు నుంచి ఇసుక తరలించి గ్రామ శివారులో ఇసుక డంపులు ఏర్పాటుచేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు విలాసాగర్‌లో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమాని సమ్మయ్య, డ్రైవర్ అభిలాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ క్రాంతి

చిట్యాల: వాలీబాల్ క్రీడలలో ఎంపికైన మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాల, బాలికలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పేరుమాండ్ల సమ్మయ్య గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ పేరుమాండ్ల జయంత్, క్రాంతి చేతుల మీదుగా సోమవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తండ్రి సమ్మయ్య జ్ఞాపకార్థం ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఏబీవీపీ నాయకులు వెల్పుల రాజ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు సూదం సాంబమూర్తి, బండి ప్రసాద్, ఉపాధ్యాయులు బుర్ర సదయ్య, శ్రీనివాస్, నీలిమారెడ్డి, రాజమౌళి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న పోలీసులు

టేకుమట్ల: పోలీస్ వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో గుంతలను ఎస్సై గోగికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చెరువు మత్తడి వద్ద గల హైలెవల్ వంతెన వద్ద భారీ గుంతలు ఏర్పడడంతో గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు. పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం మాత్రమే పరిమితం కాకుండా ప్రజా సేవలో కూడా ముందుంటారని అన్నారు. ప్రజల సహకారంతో పోలీసులు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతారని, కావున పోలీసులకు మండల ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్సై పింగిళి అమరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుల్ మహేందర్, నాగరాజు, హరికృష్ణ, కరుణాకర్, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మల్హర్: సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ నాగార్జునరావు



కాటారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై అభినవ్

మల్హర్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రించవచ్చని కాటారం సీఐ నాగార్జునరావు అన్నారు. మండలంలోని కొయ్యూరులో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను కొయ్యూరు స్టేషన్‌లో సీఐ నాగార్జున రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయలు, కాలనీలు, ప్రధాన రోడ్ల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దీంతో ప్రమాదాలు, దొంగతనాలు జరిగినప్పుడు కేసులు చేధించడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలు చేసేందుకు సైతం దొంగలు వెనకడుగు వేస్తారాని చెప్పారు. కొయ్యూరు ఎస్సై నరేష్ ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

కాటారం: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్సై మ్యాక అభినవ్ మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపుల యజమానులు, కిరాణవర్తక సంఘం, ఫెర్టిలైజర్ సంఘం సభ్యులతో సోమవారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీసీ కెమెరాలు నేర నియంత్రణలో ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానంగా పని చేస్తుందన్నారు. సంఘాల నాయకులు సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ సహకారం అందించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని అన్నారు. పలు యూనియన్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోతుల బెడద లేకుండా చూడాలి



అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న సుధీర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కోతులతో గ్రామస్తులు, భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని చెమ్మాల సుధీర్ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతిని అదనపు కలెక్టర్ విజయలక్ష్మీకి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. కోతులు చాలా మందిని గాయపరిచాయని కోతుల బెడద లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కాగా, అదనపు కలెక్టర్ స్పందించి త్వరలో పరిష్కారం చేస్తామని తెలిపినట్లు తెలిపారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్ల తొలగింపు



పొక్లెయినర్‌తో తొలగిస్తున్న ముళ్ల పొదలు

మొగుళ్లపల్లి: మండల కేంద్రం నుంచి నవాబుపేట వరకు బీటీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను మొగుళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్‌రావు సొంత ఖర్చులతో సోమవారం తొలంగించారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు భారీగా పెరిగి వాహనదారులకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆయన పొక్లెయినర్‌తో తొలగింపజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వాహనదారులు పున్నంచందర్ రావును అభినందిస్తున్నారు.

సామాజిక ఆర్థిక సర్వేపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

కాటారం: మండలంలో త్వరలో చేపట్టబోయే సామాజిక ఆర్థిక సర్వేపై సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాబు ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సామాజిక ఆర్థిక సర్వేల్లో భాగంగా గ్రామాల వారిగా అధికారుల కేటాయింపు, వివరాల నమోదు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అర్చక సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

చిట్యాల: ఉమ్మడి చిట్యాల, టేకుమట్ల మండలాల విశ్వబ్రాహ్మణ అర్చక పౌరహితం సంఘం కమిటీని సోమవారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా కల్వచర్ల కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షుడిగా నూతి సాంబమూర్తిచారి, ప్రధాన కార్యదర్శిగా మొగులోజు శివకుమార్ అచార్యులు, ప్రచార కార్యదర్శిగా బలబత్తుల రాజేశ్వరాచార్యులు, ప్రధాన సలహాదారులుగా మియాపురం రమేశ్ చార్యులు, సలహాదారులుగా పెండ్యాల ప్రభాకరాచార్యులు, అమ్మోజు వేదచార్యులు, పెద్దోజు రాకేష్ చార్యులు, వడ్లూరి బ్రహ్మాచార్యులు, మంచోజు జగదీశ్వరాచార్యులు, మడిపోజు రాజేశ్వరాచార్యులు, కేశోజు విరాట్ సూర్య తేజాచార్యులు, బోమ్మకంటి రాజేశ్వరా చార్యులు, మొగులోజు వెంకటచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దామరాజు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బుగులోని వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ నాయకులు సోమవారం పరామర్శించి, రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పోతిరెడ్డి సాంబయ్య, ఉపాధ్యక్షుడు బొంగు భిక్షపతి, కోశాధికారి కమలాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి



చిట్యాల: వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



ములుగు రూరల్‌లో..

చిట్యాల: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించాలని, త్రీవన్ సెవన్ సమస్యను సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కానుగుల రఘుపతి, ప్రధాన కార్యదర్శి గోపగాని భాస్కర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మారబోయిన మహేందర్, మండల గౌరవ అధ్యక్షుడు శ్రీరాం రఘుపతి, జిల్లా బాధ్యులు బుర్ర సదయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే అందించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సల్లగొండ పద్మాకర్ అన్నారు. సోమవారం తహసీల్దార్ విజయభాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదల చేయాలని, ఈ–కుబేర్‌లో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావల్సిన పీఆర్సీ కమిటీ రిపోర్టును అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం నవంబర్ 22 వరకు సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో 23 నుంచి హైదరాబాద్‌లో ధర్మాగ్రహదీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆకుల శేఖర్, కొండపర్తి సదయ్య, రాజిరెడ్డి, శ్యాంప్రసాద్, రవిందర్, సంపత్, వాంకుడోత్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మంగపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్



ఏటూరునాగారం: మాట్లాడుతున్న తహసీల్దార్



వాజేడులో..



వెంకటాపురం(కె): సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మిరాజయ్య

ఏటూరునాగారం: ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జగదీశ్ ఉపాధ్యాయులకు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్‌లు, ఇతర ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఫారం19 ద్వారా ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంఈఓ మల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎలక్షన్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, శంకర్, భానుప్రకాశ్, నర్సింగరావు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై ఉపాధ్యాయ సంఘాలకు తహసీల్దార్ సృజన్ కమార్, ఎంపీడీఓ జవహర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సృజన్ కుమార్ మాట్లాడుతూ.. నవంబర్ 6 వరకు అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గొంది దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: తహసీల్దార్ కార్యాలయంలో వంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమంపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కును నమోదుకు అర్హులైన వారు దరఖాస్తులను చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావు, ఎంఈఓ మేనక సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కుపై మండల కేంద్రంలో ఎంఈఓ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బీఎల్ఓలతో తహసీల్దార్ లక్ష్మిరాజయ్య ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఫారం 19 ద్వారా పాఠశాల ఎస్‌జీటీ, కళాశాల లెక్చరర్లు ఓటు హక్కు కోసం దరఖాస్తులను చేసుకోవాలన్నారు.

వాజేడు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ విజయ, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఫారం–19 ద్వారా పాఠశాల ఎస్‌జీటీ, కళాశాల లెక్చరర్లు మాత్రమే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకోవడానికి నవంబర్ 6 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ఏజెన్సీలో వలస గిరిజనేతరుల వలసలను అరికట్టాలని అన్నారు. వలస గిరిజనేతరులు నిర్మించిన అక్రమ బహుల అంతస్తుల నిర్మాణాలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్మించిన బహుల అంతస్తుల షాపింగ్‌లపై కాంప్లెక్స్‌లపై కేసు నమోదు చేయాలని అన్నారు. తాటి రాంబాబు, బొగ్గుల పాపయ్య, సున్నం గోపాల్, పూనెం సూర్యం తదితరులు ఉన్నారు.